క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవిప్రసాద్, పూర్ణిమ

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేట లోని నిర్వహించే మోదకొండమ్మ అమ్మవారి జాతరలో భాగంగా తలపెట్టిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడారంగంలో శ్రద్ధ చూపించాలన్నారు. క్రీడల తో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మరమ, పార్టీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొర్ర కాసు లమ్మ, వైస్ సర్పంచ్ గోవింద్, పీసా ఉపాధ్యక్షుడు రామకృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పండించి నేరస్తులు కావొద్దు



బోయవుటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: గంజాయిని పండించడం, అక్రమంగా రవాణా చేస్తూ నేరస్తులు కావొద్దని ఏవో ఉమాదేవి సూచించారు. ఆమె మంగళవారం నల్లగొండ పంచాయతీ బోయవుటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి తరలించడం, సాగు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సాగుతో గిరిజనుల జీవితాలు నాశనం అవుతున్నాయని చెప్పారు. గంజాయికి బదులుగా ఎక్కువ లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను వేసుకోవాలని సూచించారు. రాగులు, సామ లాంటి పంటలకు గిరాకీ ఉందన్నారు. చాలా మంది రైతులు బోర్లు వేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

'జూన్ నెలాఖరుకు నీటి కుంట పనులు పూర్తి'



నీటి కుంట పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ విద్యాసాగర్

అనంతగిరి(అరకులోయటౌన్): పంచాయతీల్లో చేపట్టిన నీటి కుంటలు(ఫారం పాండ్స్) పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండిబా పంచాయతీ టైడా గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నీటి కుంటల నిర్మాణంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. టైడా గ్రామంలో నిర్మిస్తున్న నీటి కుంటల వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ పవన్‌కుమార్, ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్, టీఏలు శోభన్‌బాబు, లవకుశ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

కొయ్యూరు: బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఇంటర్వ్యూలు మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యాలయంలో ప్రారంభమవుతాయని చెప్పారు. 33 పంచాయతీల నుంచి 228 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొత్తం 45 యూనిట్లకు అవకాశం ఉందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు విధిగా దరఖాస్తుతో పాటు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డులను జత చేసి మూడు సెట్లను అందజేయాలన్నారు. మోటారు వాహనాలకు దరఖాస్తు చేసిన వారు డ్రైవింగ్ లైసెన్స్ చూపించాలన్నారు. బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తామన్నారు.

మోదమ్మ ఉత్సవాలకు పందిరి రాట ప్రతిష్ట నేడు

సాక్షి, పాడేరు: వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో జరిగే మోదమ్మ ఉత్సవాలకు సంబంధించి పాడేరు మెయిన్‌రోడ్డు సతకం పట్టు వద్ద పందిరిరాట ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ, ఉత్సవ కమిటీల అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల భక్తులు, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులంతా ఉదయం 8.30 గంటలకు సతకంపట్టు ప్రాంతానికి చేరుకుని పందిరిరాట ప్రతిష్టను విజయవంతం చేయాలని వారు కోరారు.

పసుపు రైతు ఇంట.. సిరుల పంట

పసుపు సంప్రదాయ పంట. ఆయుర్వేద మందులకే కాదు.. సౌందర్య సాధనం కూడా. ఆరోగ్యానికి హాని చేసే ఫంగస్ బ్యాక్టీరియాలను నిరోధించడంలో దీనికి మించింది లేదు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ పంటను రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా పూర్తి సేంద్రియ విధానంలో ఏజెన్సీలో గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఏజెన్సీలోని వాతావరణ పరిస్థితులు పసుపు సాగుకు ప్రస్తుతం అనుకూలంగా ఉన్నాయి. పసుపు మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులకు ఈ పంటపై ఆసక్తి పెరగడంతో ఏటా సాగు పెరుగుతూ వస్తోంది.



వారపు సంతలో పసుపు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



ఇంటి పైకప్పుపై ఆరబెట్టిన పసుపు

3,500 మంది రైతులు

ఈ ఏడాది పసుపు కిలో రూ.130

మండలంలో 7 వేల ఎకరాల్లో పసుపు సాగు

గతేడాది కంటే రూ.20 అధికం

జి.మాడుగుల: పసుపు సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. ఏటా నష్టం మిగిల్చే ఈ పంటకు ఈ ఏడాది మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర పలుకుతుండడంతో విరివిగా లాభాలు తెచ్చిపెడుతోంది. క్వింటా పసుపు ప్రస్తుతం రూ.13వేలు పలుకడం రైతుల్లో సంతోషం కనిపిస్తోంది. ఏజెన్సీలోని వాతావరణ పరిస్థితులు పసుపు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం రైతులు పసుపు పంట నేల నుంచి వెలికి తీసే పనులు ముమ్మరం చేశారు.



వారపుసంతలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పసుపు బస్తాలను మైదాన ప్రాంతాలకు తరలించడానికి సిద్ధం చేసిన వ్యాపారులు

సంప్రదాయ విత్తనంతోనే సాగు

గిరిజన రైతులు తమకు సాంప్రదాయంగా వస్తున్న దేశవాలీ రకం(లోకల్ విత్తనం) విత్తనమే ఎక్కువగా వినియోగిస్తున్నారు. **ఎకరానికి 1100–1200 కిలోల వరకు దిగుబడి వస్తుంది. పసుపు ఆదాయం రూ.1.43 లక్షలు–రూ.1.56లక్షలు వరకు వస్తుంది. వ్యవసాయ ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. పసుపు పంట కాలపరిమితి సంవత్సరం నుంచి** ఏడాదిన్నరలో నాణ్యమైన పసుపు అత్యధిక దిగుబడికి రెండు సంవత్సరాలు కాలం ఉంచుతారు. ప్రతి ఏటా జనవరి–ఏప్రిల్ మధ్య నెలల్లో రైతులకు పంట అందివస్తుంది. సస్యరక్షణ చర్యల్లో ప్రధానమైనది కలుపు నివారణే. ఈ పనికి కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో పెట్టుబడి ఎక్కువైనా దిగుబడి బాగుంటుంది.

ఆశాజనకంగా పసుపు ధరలు

వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం పసుపు పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. గతేడాది పసుపు కిలో రూ.110 ఉంటే.. ఈ ఏడాది వారపు సంతల్లో కిలో రూ.130 వరకు పలుకుతుంది. పసుపు ధర తక్కువగా ఉన్నప్పుడు నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో రైతులు ఎప్పటికప్పుడు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. వారపు సంతల్లో ఆశించిన ధర లభిస్తుండడంతో పసుపు రైతుల ఇంట సిరుల పంటగా మారింది.



వారపు సంతలో విక్రయించడానికి సిద్ధం చేసిన పసుపు కొమ్ములు

శుద్ధి చేస్తేనే అధిక ధర

పసుపు కొమ్ములను భూమి నుంచి తవ్వి తీసిన తరువాత శుద్ధి చేయాల్సి ఉంటుంది. పచ్చి పసుపు మట్టితో ఉంటుంది. దీనికి ధర కూడా తక్కువే. అలా కాకుండా శుద్ధి చేస్తే ధర పెరుగుతుంది. పంట భూమి నుంచి తెచ్చిన పసుపు కొమ్ములను తొలుత డ్రమ్ములో వేసి వేడి నీటిలో ఉడికించాలి. తరువాత సూర్యరశ్మి(ఎండ) బాగా తగిలే చోట ఆరబెట్టాలి. ఇలా కనీసం 10–15 రోజుల పాటు ఆరబెట్టి విక్రయించడానికి సిద్ధం చేస్తారు. గ్రామాల్లో ఎక్కువగా ఇంటి పైకప్పు, వరండా, సీసీ రోడ్లపై **ఆరబెడుతున్నారు.** మండలంలో 17 పంచాయతీల్లో 450 గ్రామాలు ఉండగా.. 3,500 మంది గిరిజన రైతులు 7 వేల ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు.



శుద్ధి కోసం ఉడకబెడుతున్న పసుపు

దిగుబడి, ధర బాగుంది



ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో పసుపు దిగుబడి బాగుంది. అలాగే వారపు సంతల్లో మార్కెట్ ధర కూడా బాగుంది. గతేడాది రూ.110 కిలో పసుప ధర పలకగా.. ఈ ఏడాది కిలో రూ.130 ధర ఉంది. ఈ సంవత్సరం ఎకరాలో పసుపు వెలిక తీయగా ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది.

– చినకొండబాబు, పసుపు రైతు, గడుతూరు గ్రామం

రెండేళ్లుగా దిగుబడి బాగుంది

మండలంలో 3,500 మంది రైతులుండగా.. 7 వేల ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి పసుపు దిగుబడి బాగుంది. ఈ ఏడాది పసుపు ధర ఆశాజనకంగా ఉంది. రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– బాలకర్ణ, ఇన్‌చార్జి హార్టికల్చర్ అధికారి, చింతపల్లి

పలు సమస్యలపై మోనిటరింగ్ కమిటీలో చర్చ



పాడేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంధం శ్రీదేవి

రంపచోడవరం: పాడేరులో అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మోనిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశంలో పాల్గొని పలు సమస్యలపై చర్చించినట్లు రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి తెలిపారు. జాతీయ రహదారి–516–ఈకి సంబంధించిన సమస్యలు, ఐ పోలవరం కూడలిలో బస్ షెల్టర్ నిర్మాణం, అటవీ అభ్యంతరాలు వల్ల నిలిచిపోయిన రహదారుల గురించి, మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యల కోసం ప్రస్తావించినట్లు ఆమె చెప్పారు. కార్మిక శాఖ పనితీరు గురించి, ప్రోటోకాల్ సక్రమంగా అమలు కావడం లేదని కమిటీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. బూరుగుబంద–తాటివాడ గ్రామాల మధ్య కూలిపోయిన కల్వర్టు నిర్మాణం కోసం, ముసురుమిల్లి ప్రాజెక్టులో ఎత్తిపోతల పథకం కోసం, భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టులో పర్యాటక అభివృద్ధి గురించి, జీడిమామిడి పంటకు గిట్టుబాటు ధర, వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా గురించి చర్చించామన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి



మొండిగెడ్డ సచివాలయంలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పాపారావు

గూడెంకొత్తవీధి: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని గూడెం కొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన ఈవోపీఆర్డీ పాపారావుతో కలసి జర్రెల, మొండిగెడ్డ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై ఆరా తీశారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పెదబయలు: యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ కె.రమణ సూచించారు. మంగళవారం పెదబయలు మండలం మారుమూల ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు, ఇతర ఆన్‌లైన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు మార్గాల వైపు వెళ్లొద్దని చెప్పారు. వాహన ప్రమాదాల్లో ఎక్కువగా యువకులు ఉంటున్నారన్నారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలు, గంజాయి సాగు, రవాణా, పైలట్‌గా వెళ్లడం నేరమని, సారా తయారీ, అమ్మకం నేరమన్నారు. గంజాయికు సంబంధించి నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్(ఎన్‌డీపీఎస్)పై అవగాహన కల్పించారు. మహిళలు శక్తియాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మూఢ నమ్మకాలు వీడాలని, చేతబడి జోలికి పోవద్దని చెప్పారు. గ్రామంలోని పాఠశాలలో 30 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



గిన్నెగరువులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమణ

రాజవొమ్మంగిలో ఎమ్మెల్యే శిరీషదేవి పర్యటన

రాజవొమ్మంగి: రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి మండల కేంద్రం రాజవొమ్మంగిలో మంగళవారం పర్యటించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో (ఆదర్శ పాఠశాల) జరిగిన సభలో 27 పాఠశాలలకు అవసరమైన రూ.17 లక్షల విలువైన ఫర్నిచర్‌ను ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అందజేశారు. వీటిని హడ్కో ఉచితంగా అందజేసిందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తేవాలన్నారు. అనంతరం ఆమె రాజవొమ్మంగిలో జరుగుతున్న వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువ పూడిక తీత పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.



వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువలో పూడిక తీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



లబ్బింగిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, ఐసీడీఎస్ పీవో రమణ

చింతపల్లి: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.వి. రమణ అన్నారు. మంగళవారం మండలంలోని లబ్బంగి, కొత్తవీధి, గొందిపాకలు గ్రామాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా తక్కువ ధరకు లభించే పోషకాహారాన్ని రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్‌లు విజయకుమారి, గౌహర్‌ఉన్నీషా, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు 4 గంటలు పని చేయాలి

వీఆర్‌పురం: ఉపాధి హామీ పథకం కూలీలు పూడిక పనులను కచ్చితంగా నాలుగు గంటల పాటు చేయాలని ఏపీవో శ్రీనివాసు అన్నారు. మంగళవారం వీఆర్‌పురం మండల కేంద్రం రాజుపేట కాలనీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఒక క్యూబిక్ మీటర్ పనిచేస్తే రూ.307 వస్తాయని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు వస్తుందని, ఫీల్డ్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు వేరొకరి జాబ్ కార్డు మీద పని చేసినట్లు, ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బొర్ర సాయిబాబు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఏపీవో శ్రీనివాసు

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు



ముంచంగిపుట్టులో అధికారులకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, వీఆర్‌ఏలు

చింతపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహసీల్దార్ రవికుమార్‌కు మంగళవారం గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) వినతి పత్రం అందజేశారు. తమ జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఖాళీగా ఉన్న పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు కుర్జా కళ్యాణం, కార్యదర్శి లోచల కృష్ణారావు, కంతా బాలరాజు, బేరా రాణి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

పెదబయలు: గ్రామ పంచాయతీ స్థాయిలో పని చేస్తున్న వీఆర్‌ఏల వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల నాయకుడు బొండా సన్నిబాబు, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు జి.నీలకంఠం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రంగారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, మండల రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న వాచ్‌మన్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞపిత చేశారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల కార్యదర్శి నిక్కుల సుందర్‌దేవ్, కోటేశ్వరరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు పి.భీమరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి వీఆర్‌ఏలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు భీమరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీఆర్‌ఏలపై పని భారం మోపి, నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైసు మిల్లుల వద్ద డ్యూటీలు వేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు నామినీలతో సహా వీఆర్‌ఏల అందరికీ పేస్కేల్ జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు శ్యామ్, లోహితాసు, పరుశురాం పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలో రికార్డుల పరిశీలన



పశువుల ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ షేక్ అహ్మద్ షరీఫ్

రాజవొమ్మంగి: స్థానిక పశువుల ఆస్పత్రిని మంగళవారం జిల్లా పశు సంవర్థక శాఖ డీడీ షేక్ అహ్మద్ షరీఫ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించారు. పశువులకు సరఫరా చేస్తున్న వ్యాక్సిన్‌ను సకాలంలో, ప్రతి రైతు క్షేత్రంలో పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఏడీ గణేశ్, స్థానిక వెటర్నరీ డాక్టర్ తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కొయ్యూరు: ఎపిడమిక్ సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వైద్య సిబ్బంది, మహిళా సంరక్షణ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికి అత్యవసరమైనా ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు తగిన సలహాలు ఇవ్వాలని కోరారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

నిరుద్యోగులకు బ్యాంకు రుణాలు

చింతపల్లి: మండలంలో నిరుద్యోగులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 41 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి ధ్రువపత్రాలను మంగళవారం పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సతీష్‌చంద్ర, గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

వీఆర్‌పురం: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూకు బ్యాంక్ మేనేజర్ హాజరు కానున్నారని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆశ వర్కర్ల పని విధానంపై అవగాహన

వీఆర్‌పురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లకు పని చేసే విధి విధానాలపై మంగళవారం డాక్టర్ అనిల్ కుమార్ సూచనలు, సలహాలు చేశారు. ప్రసవం, శిశువుల సంరక్షణ, పోషకాహారం, పరిశుభ్రత, వ్యాధుల నివారణ, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆశా వర్కర్లకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌లు, హెచ్‌వీలు, హెచ్‌ఏలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.



ఆశ వర్కర్లకు పని విధానంపై సూచనలు చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలి



గర్భిణులు, బాలింతల జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, మహిళలు

ముంచంగిపుట్టు: గర్భిణులు, బాలింతలు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్‌వైజర్ సిహెచ్.వరహాలమ్మ అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో మంగళవారం గర్భిణులు, బాలింతలు రెండు సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పాటించే ఆరోగ్య సూత్రాలు, తీసుకున్న ఆహారంపై పిల్లల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని వరహాలమ్మ చెప్పారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.